సాక్షి
నల్లగొండ
సోమవారం । 30 । డిసెంబర్ । 2024



శతాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు
భారత కమ్యూనిస్ట్ పార్టీ వంద వసంతాల ఉత్సవాల కోసం నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానం ముస్తాబైంది. - 8లో



రిజర్వేషన్లు పెంచిన తర్వాతే..
బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. - 8లో



పుష్‌పుల్ రైళ్లు రద్దు
నడికుడి–కాచిగూడ మధ్య నడిచే పుష్‌పుల్ రైళ్లను రద్దు చేస్తూ సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు మరమ్మతులు చేయండి



నల్లగొండలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: నల్లగొండలోని అర్బన్ కాలనీలో నిర్మించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో చిన్నచిన్న మరమ్మతులన్నింటినీ వచ్చేనెల 15వ తేదీలోపు పూర్తిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. నల్లగొండ కలెక్టరేట్ వెనుకవైపు అర్బన్ కాలనీలో ఇదివరకే జీ ప్లస్ మోడల్ నిర్మించిన 550 ఇళ్లను ఆదివారం ఆమె పరిశీలించారు. ఇళ్లలో చిన్న మరమ్మతులకు సంబంధించి అంచనాలు రూపొందించి పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, హౌసింగ్‌పీడీ రాజ్‌కుమార్, పీఆర్ ఎస్ఈ తిరుపతయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- 31న రాత్రి 10 గంటల నుంచి డ్రింక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం: నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా అంతటా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా మంగళవారం (31న) రాత్రి 10 గంటల నుంచి పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తారని తెలిపారు. డీజేలు, మైక్‌లు పెట్టొదని, టపాసులు కాల్చవద్దని, రోడ్లపై ఇతరులకు ఆటంకం కలిగించేలా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా కేసులు నమోదు చేస్తామని, కేసులు నమోదైతే పాస్‌పోర్టులు లభించవని హెచ్చరించారు. మద్యం తాగి పట్టుబడిన వారిని బైండోవర్ చేస్తామని పేర్కొన్నారు. మఫ్టీలో పోలీస్ సిబ్బంది నిఘా ఉంటుందని, షీ టీం పోలీసులు, టాస్క్‌ఫోర్సు సిబ్బంది రాత్రి పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.

నృసింహుడికి సంప్రదాయ పూజలు



ఆలయ మాడ వీధిలో కిక్కిరిసిన భక్తులు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకుజామును ఆలయాన్ని తెరిచ్చిన అర్చకులు స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూలను నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అలాగే ప్రథమ ప్రాకార మండపం, ముఖ మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవను ఆలయంలో భక్తుల మధ్య ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని మూసివేశారు.

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్‌నిర్మాణంలో భాగంగా వైటీడీఏ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ఆదివారం ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ ఈఎన్‌సీలు మోహన్‌నాయక్, రత్నం, సీఈలు పరిశీలించారు. ప్రధానాలయం, ప్రెసిడెన్షియల్ సూట్, రోడ్లు, లక్ష్మీపుష్కరిణి, కల్యాణకట్ట, క్యూకాంప్లెక్స్, ప్రసాద విక్రయశాల, పెద్దగుట్టపై రోడ్లు, 320 పనులను పరిశీలించారు. ఆయా పనులకు సంబంధించి రూ.127 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు అంచనా వేశారు. ప్రభుత్వానికి అందజేసేందుకు నివేదిక రూపొందించారు.

ప్రగతి పరుగులు

- పెండింగ్ ప్రాజెక్టుల్లో కదలిక.. కొత్తవి మంజూరు
- రోడ్లు, ఎత్తిపోతల పథకాలకు భారీగా నిధులు
- యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు రెండో యూనిట్ సింక్రనైజేషన్ పూర్తి
- ఇంటిగ్రేటెడ్ గురుకులాలకు శ్రీకారం
- నల్లగొండను అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపేలా మంత్రుల కృషి

సాక్షి నెట్‌వర్క్ : ఉమ్మడి నల్లగొండ జిల్లాకు 2024సంవత్సరం కలిసొచ్చింది. జిల్లాలో ఈ సంవత్సరం అభివృద్ధి, సంక్షేమ పథకాలు పరుగులు పెట్టాయి. కొన్ని కొత్త పనులు మంజూరు కాగా ఇప్పటికే కొనసాగుతున్నవి పూర్తయి ప్రారంభోత్సవానికి నోచుకున్నాయి. మరికొన్నింటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పెండింగ్ ఉన్నవాటిలో కదలిక వచ్చింది. ప్రధానంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు రెండో యూనిట్ సింక్రనైజేషన్ పనులు ప్రారంభించారు. బ్రాహ్మణ వెల్లెంల ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా కాల్వలు , ఐదు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు శంకుస్థాపనలు జరిగాయి. ఎస్సెల్బీసీ సొరంగ మార్గం పనులకు నిధులు మంజూరయ్యాయి. జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉమ్మడి నల్లగొండను అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపేలా ముందుకెళ్తున్నారు.

నియోజకవర్గాల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులు ఇలా..

నల్లగొండ..

- నల్లగొండ నుంచి ముశంపల్లి వరకు రూ.100 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.
- నల్లగొండకు రింగ్ రోడ్డు నిర్మాణానికి (బైపాస్) రూ.516 కోట్లు మంజూరయ్యాయి. – నల్లగొండ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలకు రూ.300 కోట్లు మంజూరయ్యాయి. గురుకులం నిర్మాణానికి నల్లగొండలోని ఎస్ఎల్‌బీసీ వద్ద మంత్రి కోమటిరెడ్డి శంకుస్థాపన చేశారు.
- లతీఫ్‌సాబ్‌గుట్ట, బ్రహ్మంగారిగుట్టలకు ఘట్ రోడ్ల నిర్మాణానికి రూ.140 కోట్లను మంజూరు చేశారు.
- ఈ నెల 7వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి నల్లగొండ జిల్లాకు వచ్చిన సమయంలో మెడికల్ కాలేజీని ప్రారంభించడంతోపాటు రూ.50 కోట్లతో నిర్మించనున్న నర్సింగ్ కాలేజీ పనులకు, నల్లగొండ పట్టణంలో రూ.109 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
- నియోజకవర్గ పరిధిలో ఆర్‌అండ్‌బి రోడ్ల నిర్మాణానికి రూ. 516 కోట్లు, పాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి మరో రూ.25 కోట్లు మంజూరయ్యాయి.
- నల్లగొండలో యూజీడీ నిర్మాణం కోసం రూ.213 కోట్లు విడుదలయ్యాయి.
- పట్టణంలో తాగునీటి ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటుకు రూ.556 కోట్లు మంజూరయ్యాయి. పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.
- రూ.57 కోట్లతో నల్లగొండలో సీసీ రోడ్లను నిర్మిస్తున్నారు.

దేవరకొండ:

- దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని 200 పడకలకు పెంచేందుకు పట్టణంలోని పలుచోట్ల స్థల పరిశీలిన చేశారు. ఇందుకు గాను రూ.89 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయగా అనుమతులు రావాల్సి ఉంది.
- ఎస్‌డీఎఫ్, ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ నిధులు రూ.50 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం కొనసాగుతోంది.
- కొండమల్లేపల్లి, నేరేడుగొమ్ములో రెండు కేజీబీవీ భవనాలు నిర్మాణం పూర్తయింది.



మన్నెవారిపల్లి వద్ద సొరంగమార్గం(ఫైల్)

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో పురోగతి

శ్రీశైలం సొరంగ మార్గం (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ పనుల్లో పురోగతి కనిపిస్తోంది. అమెరికా నుంచి టీబీఎం(టన్నెల్ బేరింగ్ మిషన్) సముద్ర మార్గాన బయల్దేరింది. సెప్టెంబర్ 20న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమీక్ష సమావేశం నిర్వహించి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు పూర్తి చేసేందుకు రూ.4,637కోట్లను కేటాయిస్తూ మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నారు. 2027 నాటికి పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

ఉమ్మడి జిల్లాకు కలిసొచ్చిన 2024



బ్రాహ్మణ వెల్లెంల ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

రివైండ్ 2024

నకిరేకల్..

బ్రాహ్మణవెల్లెంల – ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కింద డెలివరీ చానల్స్‌ను ఈనెల 7న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. రూ.37 కోట్లతో కాల్వల పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. కాల్వల నిర్మాణానికి భూ సేకరణ కొనసాగుతోంది. భూమి కోల్పోయిన రైతులకు త్వరలో పరిహారం అందనుంది.

యాదగిరిగుట్టలో మెరుగైన సౌకర్యాలు

- యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సౌకర్యాలు మరింత మెరుగుపడ్డాయి.
- మూసీ పునరుజ్జీవంపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే కార్యక్రమంలో భాగంగా నవంబర్ 8న సీఎం రేవంత్‌రెడ్డి వలిగొండ మండలం సంగెం వద్ద మూసీ వెంట 2కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. భీమలింగం వద్ద శివలింగం ప్రాంతం అభివృద్ధికి రూ.2 కోట్లు ప్రకటించారు.
- హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా నందిగామ వరకు 181.5 కిలోమీటర్ల పరిధి 17బ్లాక్ స్పాట్‌లను జాతీయ రహదారి సంస్థ అధికారులు గుర్తించారు. ఆయా చోట్ల ఒక ఫ్లెటైవర్, 13అండర్‌పాస్‌లు, 11చోట్ల సర్వీస్ రోడ్లు నిర్మాణం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు రూ.282 కోట్లతో టెండర్లు పిలిచారు.



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు (ఫైల్)

మిర్యాలగూడ..

- దున్నపోతులగండి, బొత్తలపాలెం, తోపుచర్ల, వీర్లపాలెం-2, కేశవాపురం ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరయ్యాయి.
- మిర్యాలగూడ పట్టణంలో రూ.180 కోట్లతో మూడు ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టారు.
- అమృత్ పథకం కింద రూ.320 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, 20ఎంఎల్‌డీ వాటర్ ఫిల్టర్ బెడ్స్, ఎస్‌టీపీ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు.
- దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద 4వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ రెండో యూనిట్ సింక్రనైజేషన్ పనులను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. థర్మల్ విద్యుత్ ప్లాంట్‌కు బొగ్గు రవాణా కోసం విష్ణుపురం రైల్వేస్టేషన్ నుంచి పవర్‌ప్లాంట్ వరకు 8 కి.మీ మేర రూ.400 కోట్లతో నిర్మించిన రైల్వే ట్రాక్‌ను మంత్రులు ప్రారంభించారు.
- యాదాద్రి పవర్‌ప్లాంట్ ఉద్యోగుల కోసం కృష్ణా నది సమీపంలోని తుంగపాడు బంధం కలిసే చోట 3,52,771.02 చదరపు మీటర్ల విస్తీర్ణంతో టౌన్‌షిప్ నిర్మాణానికి టెండర్లు పిలిచింది. ఈ టౌన్‌షిప్ 30 నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది.



యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో యూనిట్-2 పైలాన్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి(ఫైల్)

రైల్వే డబ్లింగ్ పనులు ప్రారంభం

గుంటూరు– బీబీనగర్ మధ్య 239కి.మీ మేర రైల్వే డబ్లింగ్ పనులు ప్రారంభమయ్యాయి. దీని కోసం గత ఏడాది రూ.2853కోట్లు కేటాయించారు. ఇటీవల మట్టి నమూనాలను కూడా సేకరించారు. ఈ మార్గంలో విష్ణుపురం జంక్షన్ కానుండడంతో మోటుమర్రి, జగ్గయ్యపేట, యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు అనుసంధానం చేయనున్నారు.

- దామరచర్ల మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి– అద్దంకి రహదారి నుంచి యాదాద్రి పవర్ ప్లాంట్ వరకు 16.6 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి రూ.236 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభించనున్నారు.

నాగార్జునసాగర్..

- పెద్దవూర మండలంలోని పూల్యాతండా సమీపంలో వరద కాలువపై రూ.2.47 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు.
- తిరుమలగిరి సాగర్ మండలంలోని కృష్ణపట్టి ప్రాంతంలో నెల్లికల్లు ఎత్తిపోతల పథకం పనులను నాలుగు విడతలుగా విభజించింది. మొదటి ఫేజ్‌లో భాగంగా సుమారు నాలుగు వేల ఎకరాలకు సాగునీరు అందించేలా పనులు సాగుతున్నాయి.
- రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న భూ భారతి (ఆర్ ఓఆర్ చట్టం)లో భాగంగా తిరుమలగిరిసాగర్ మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా గుర్తించి భూసర్వే చేయిస్తోంది. 18వేల ఎకరాలకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించనుంది.

మునుగోడు..

- చౌటుప్పల్‌లో అమృత్ పథకం కింద రూ.20 కోట్ల 5ట్యాంకుల నిర్మాణాలు మొదలయ్యాయి.
- చౌటుప్పల్ నుంచి వలిగొండ రోడ్డులో మున్సిపాలిటీ పరిధిలో రూ.9.95 కోట్లతో రెండు కిలోమీటర్ల మేర నాలుగు లేన్లుగా విస్తరించనున్నారు.
- మునుగోడు మండలం కల్వకుంట్ల గ్రామంలో 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.100 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, చిత్రంలో యూటీఎఫ్ ప్రతినిధులు

- విద్యకు తగిన బడ్జెట్ కేటాయించాలి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నల్లగొండ: ప్రభుత్వ రంగాన్ని కాపాడాలంటే ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని, అప్పుడే అన్నివర్గాలకు సమాన విద్య అందుతుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. నల్లగొండలో కొనసాగుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 6వ మహాసభల సందర్భంగా రెండో రోజైన ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన విద్య విధానం అమలైతే విద్యా వ్యవస్థ పూర్తిగా ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలోకి వెళుతుందన్నారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 15 శాతం నిధులు, కేంద్ర ప్రభుత్వం ఆరు శాతం నిధులు కేటాయిస్తేనే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ పోస్టులు భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం అమలుకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజ్ చేయాలని, ఒకవేళ న్యాయపర చిక్కులుంటే సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేసే వారికి కనీస వేతనం అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షులు సీహెచ్.రాములు, రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బక్క శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు ప్రతినిధుల సభ

నల్లగొండ జిల్లా కేంద్రంలో లక్ష్మీగార్డెన్స్‌లో నిర్వహిస్తున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు రెండో రోజు కొనసాగాయి. ఇందులో భాగంగా ఆదివారం ప్రతినిధుల సభ జరిగింది. ఈ సభలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యవస్థపై అవలంబిస్తున్న నిర్లక్ష్యంపై ధ్వజమెత్తారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం కావాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగినన్ని నిధులు కేటాయించి పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

పదెకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలి

నల్లగొండ అగ్రికల్చర్: సాగు చేసిన రైతులందరికీ పది ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో టెస్కాబ్‌లో జరిగిన సమావేశానికి హాజరైన రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రుణమాఫీ అమలు కాని రైతులందరికీ వెంటనే రుణమాఫీ చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల కోసం సబ్సిడీ విడుదలచేయాలన్నారు. మంత్రి తుమ్మల సానుకూలంగా స్పందించారని తెలిపారు. వినతి అందజేసిన వారిలో టెస్కాబ్ చైర్మన్ ఎం.రవీందర్‌రావు, ఇతర జిల్లాల డీసీసీబీ అధ్యక్షులు పాల్గొన్నారు.



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న కుంభం

అమిత్‌షా రాజీనామా చేయాలి

నల్లగొండ టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలు అవమానకరమని, వెంటనే అమిత్ షాను కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం నల్లగొండలోని డీఈఓ ఆఫీస్ వద్దగల అంబేద్కర్ విగ్రహం సాక్షిగా నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు తుమ్మల వీరారెడ్డి, నెల్లికంటి సత్యం మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన పదవిలో ఉండి అంబేద్కర్‌ను కించపరిచే వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్, సీపీఎం, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఇందుర్ సాగర్, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారి ఐలయ్య, బండ శ్రీశైలం, సయ్యద్ హాషం, పాలడుగు నాగార్జున, సీహెచ్ లక్ష్మీనారాయణ, పి.ప్రభావతి, ఎండీ. సలీం, దండంపల్లి సత్తయ్య, నల్పరాజు సైదులు, మల్ల మహేష్, కొండా అనురాధ, గాదె నరసింహ, దండెంపల్లి సరోజ, కోట్ల అశోక్‌రెడ్డి, గంజి నాగరాజు, ఊట్కూరు మధుసూదన్‌రెడ్డి, కొండా వెంకన్న, సత్యనారాయణ, బొల్లు రవీందర్, అరుణకుమారి, పాకలింగయ్య, పరిపూర్ణాచారి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు


ఉపాధ్యాయ ఓటర్లు 24,905

- మహిళా ఓటర్లు 9,965.. పురుషులు 14,940 మంది
- 12 జిల్లాల్లో 200 పోలింగ్ కేంద్రాలు
- నేడు ఓటర్ల తుది జాబితా విడుదల

నల్లగొండ: వరంగల్–నల్లగొండ–ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల తుది జాబితా విడుదలకు యంత్రాంగం సిద్ధమైంది. సోమవారం తుది జాబితా విడుదల కానుంది. నవంబర్ 23న ముసాయిదా ప్రకటించగా 22,554 మంది ఓటర్లు నమోదయ్యారు. దరఖాస్తుల గడువు పెంచడంతో మరో 2,351 ఓటర్లు పెరిగారు. దీంతో 12 జిల్లాల్లో ఓటర్లు 24,905 మందిగా నమోదయ్యారు. మహిళా ఓటర్లు 9,965, పురుషులు 14,940 మంది ఉన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 4,483 మంది ఓటర్లు ఉన్నారు.

27వేల దరఖాస్తులు..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవీ కాలం 2025 మార్చి 29తో ముగియనుంది. అయితే ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు పాత ఓటర్ల జాబితా రద్దు చేసి తిరిగి కొత్త ఓటు నమోదుకు శ్రీకారం చుట్టింది. గత సెప్టెంబర్ 30న ఓటర్ల జాబితా రద్దు చేసినట్లు ప్రకటించిన ఎన్నికల సంఘం అక్టోబర్ 1 నుంచి ఉపాధ్యాయులంతా తిరిగి ఓటు నమోదు చేసుకోవాలని ప్రకటించింది. అప్పటి నుంచి ఉపాధ్యాయులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దీంతో 27 వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయి. వాటిన్నింటిని పరిశీలించిన ఎన్నికల అధికారులు నిబంధనలకు అనుగుణంగా ఉన్న దరఖాస్తులను ఆమోదించి ముసాయిదా ఓటర్లు జాబితాను నవంబర్ 23న ప్రకటించారు. ఆ తర్వాత కూడా ఓటు నమోదుకు మళ్లీ అవకాశం కల్పించారు. వాటిని పరిగణనలోకి తీసుకుని ఈనెల 30న తుది ఓటర్ల జాబితా ప్రకటించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు సిద్ధం చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని 12 జిల్లాల పరిధిలో మొత్తం 200 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు.



ఉమ్మడి జిల్లాలో ఓటర్ల వివరాలు..

జిల్లా	పీఎస్‌లు	పురుషులు	స్త్రీలు	మొత్తం
భువనగిరి	17	595	326	921
సూర్యాపేట	23	1,690	947	2,637
నల్లగొండ	37	2,688	1,795	4,483

బతుకమ్మ ఆడి నిరసన



నల్లగొండ కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నల్లగొండ: సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ ముందు కొనసాగుతున్న నిరవధిక సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరింది. ఉద్యోగులు ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ బతుకమ్మ ఆడారు. ఈ సమ్మెకు పలు సంఘాల నేతలు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మొలుగూరి కృష్ణ, బొమ్మగాని రాజు, కంచర్ల మహేందర్, క్రాంతి కుమార్, కొండ చంద్రశేఖర్, గుమ్మల మంజులారెడ్డి, సావిత్రి, పుష్పలత, సాయిల్, వెంకట్, జి.వెంకటేశ్వర్లు, ఎర్రమల్ల నాగయ్య, చందపాక నాగరాజు, బంటు రవి, లలిత, కొండయ్య, యాదయ్య, యాట వెంకట్, జి.వెంకటేశ్వర్లు, దార వెంకన్న, శ్రీనివాస్, వి.రమేష్, వసంత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గోవులను తరలిస్తున్న వాహనం పట్టివేత



బొలేరో వాహనంలో పట్టుబడిన గోవులు

చింతపల్లి: బొలేరో వాహనంలో మల్లేపల్లి సంత నుంచి హైదరాబాద్‌కు ఆదివారం ఎనిమిది గోవులను అక్రమంగా తరలిస్తుండగా చింతపల్లి మండల కేంద్రంలో స్థానిక బీజేపీ నాయకులు వాహనాన్ని అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన గోవులను నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలోని గోశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదయ్య తెలిపారు.

వ్యభిచార ముఠా గుట్టురట్టు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్న రెండు కేంద్రాలపై ఆదివారం పట్టణ పోలీసులు దాడులు నిర్వహించి ఆరుగురిని అరెస్ట్ చేశారు. సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని నయానగర్, శ్రీమన్నారాయణ కాలనీల్లో నలుగురు మహిళలు రెండు ఇళ్లను అద్దెకు తీసుకొని వ్యభిచారం నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేశారు. వ్యభిచారం నిర్వహిస్తున్న నలుగురు మహిళలతో పాటు ఇద్దరు విటులు, ముగ్గురు యువతులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 6 సెల్‌ఫోన్‌లు, రూ.1500 నగదు స్వాధీనం చేసుకుని నలుగురు మహిళా ఆర్గనైజర్లతో పాటు ఇద్దరు విటులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మతిస్థిమితం లేని వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన మతిస్థిమితం లేని వ్యక్తి

చౌటుప్పల్ రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మతిస్థిమితంలేని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దండుమల్కాపురం గ్రామ పరిధిలోని ఆందోళ్ మైసమ్మ గుడి సమీపంలో మతిస్థిమితంలేని వ్యక్తి(40) కొద్దిరోజులుగా సంచరిస్తున్నాడు. గుడి చుట్టుపక్కల చెత్త కాగితాలు ఏరుకుంటూ అక్కడే ఉంటున్నాడు. ఆదివారం ఉదయం గుడి సమీపంలో హైవేపై విజయవాడ వెళ్తున్న గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. దీంతో అతడి తలకు బలమైన గాయమైంది. పోలీసులు పెట్రోలింగ్ వాహనంలో చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఎస్‌ఐ చల్ల యాదవరెడ్డి తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జూదరుల అరెస్ట్

వేములపల్లి: పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ డి. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండల కేంద్రంలోని చిన్నచెరువు వద్ద ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో వేములపల్లి గ్రామానికి చెందిన జి. రామ్మూర్తి, సీహెచ్. నగేష్, పి. శ్రీనాథ్, జి. మల్లయ్య ఉన్నారు. మరో ఇద్దరు పరారైనట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి నాలుగు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.9,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- నేడు నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ
- హాజరు కానున్న పార్టీ జాతీయ నాయకులు



నల్లగొండలో శతాబ్ది ఉత్సవాల వాల్ రైటింగ్



ఎన్జీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వంద వసంతాల ఉత్సవాల కోసం నీలగిరి పట్టణం ముస్తాబైంది. పార్టీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు (సోమవారం) ఎన్జీ కళాశాల మైదానంలో మధ్యాహ్నం 2గంటలకు పార్టీ ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సభను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణమంతా వాల్‌రైటింగ్‌లు, ఎర్రజెండా తోరణాలు, ఫ్లెక్సీలతో ముస్తాబు చేశారు. శతాబ్ది ఉత్సవాలకు సంబంధించి గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా ప్రచార యాత్రను పెద్ద ఎత్తున నిర్వహించారు. దేశ ప్రజల సామాజిక, రాజకీయ, ఆర్థిక హక్కుల కోసం సుదీర్ఘమైన పోరాటాలను నడిపించిన సీపీఐ అదే స్ఫూర్తితో బహిరంగ సభను జయప్రదం చేయడం కోసం పార్టీ శ్రేణులు సన్నద్ధమయ్యారు. ఈ మహాసభకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీ, జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, పశ్య పద్మ, టి.శ్రీనివాసరావు హాజరు కానున్నారు.

సభకు అధిక సంఖ్యలో తరలిరావాలి



సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నేడు నల్లగొండలో నిర్వహించే బహిరంగ సభకు ఉమ్మడి జిల్లా నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలి. సభను విజయవంతం చేసేందుకు జిల్లా, మండల, పట్టణ అన్ని విభాగాల బాధ్యులు సమష్టిగా పనిచేయాలి.

– నెల్లికంటి సత్యం, సీపీఐ జిల్లా కార్యదర్శి, నల్లగొండ

ఉత్సవాలకు తరలిరండి

- కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నల్లగొండ టౌన్: నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో సోమవారం జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని మగ్దూం భవన్‌లో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమ్యూనిజానికి అంతం లేదని.. పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చే పార్టీలు అధికారం లేకపోతే కనుమరుగవుతాయన్నారు. అధికారం ఉన్నా లేకపోయినా ప్రజల కోసమే తమ పార్టీ పోరాడుతోందన్నారు. దేశ స్వాతంత్య్రం, తెలంగాణ విముక్తి ఉద్యమాల్లో ఎంతో మంది భారత కమ్యూనిస్టు పార్టీ నేతలు అమరులయ్యారని వారి ఆశయ సాధనలో భాగంగా శతాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. సీపీఐ ఆవిర్భావం నుంచి ఎన్నో కుట్రలు, నిర్బంధాలు, కేసులను ఎదుర్కొని నేటికీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం గర్వకారణమన్నారు. జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. బహిరంగ సభకు ఉమ్మడి జిల్లా నుంచి 20వేల మంది ఎర్ర చొక్కాలు ధరించి పార్టీ శ్రేణులు తరలి వస్తారన్నారు. ఈ సమావేశంలో నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, ఉజ్జిని రత్నాకర్‌రావు, ఉజ్జిని యాదగిరిరావు, లొడంగి శ్రవణ్‌కుమార్, కె.శ్రీనివాస్, పల్లె నరసింహ, పబ్బు వీరస్వామి, అంజాచారి, బంటు వెంకటేశ్వర్లు, బి.నర్సింహ, గురిజ రామచంద్రం, టి.వెంకటేశ్వర్లు, రామలింగం, రమేష్, పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చోరీ



ఆలయంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

వేములపల్లి(మాడ్గులపల్లి), త్రిపురారం: ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారు ఆభరణాలు, నగదు అపహరించారు. ఈ ఘటన త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దదేవులపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ తలుపులను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి నాలుగు జతల బంగారు పుస్తెలు, ఐదు తులాల వెండి మెట్టెలు, మైక్‌సెట్, రూ.3వేల నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం ఆలయ పూజారి తిరుమల జగన్‌మోహనాచార్యులు వచ్చేసరికి ఆలయం తలుపులు పగులగొట్టి ఉండడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మాడుగులపల్లి ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. నల్లగొండ నుంచి క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించినట్లు పేర్కొన్నారు.

అప్పుల బాధతో వివాహిత ఆత్మహత్య



వెంకటమ్మ (ఫైల్)

చండూరు: అప్పుల బాధతో పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన చండూరు మున్సిపాలిటీ కేంద్రంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన దోటి వెంకటమ్మ(39) తన భర్త వెంకటయ్యతో కలిసి కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తోంది. వీరికి అప్పులు అధికం కావడంతో ఇటీవల వారికున్న భూమిని విక్రయించాలని అనుకున్నారు. ఆ భూమికి దారి సమస్య ఉండడంతో భూమి అమ్మడం కష్టంగా మారింది. దీంతో మనస్తాపానికి గురైన వెంకటమ్మ శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం మృతురాలి భర్త యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకన్నగౌడ్ తెలిపారు.

కశ్మీర్ నుంచి కన్యాకుమారి పాదయాత్ర సాహసోపేతమే

- మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్



బాలకృష్ణ గురుస్వామిని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

చౌటుప్పల్ : తల్లిలాంటి గోవు కోసం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బాలకృష్ణ గురుస్వామి పాదయాత్ర చేయడం సాహసోపేతమేనని భువనగిరి మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన పాదయాత్ర ఈనెల 25న చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి విచ్చేసిన క్రమంలో బాలకృష్ణ గురుస్వామి తీవ్ర అస్వస్థతకు గురై స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బూర నర్సయ్యగౌడ్ స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆదివారం ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బూర నర్సయ్యగౌడ్ మాట్లాడారు. బాలకృష్ణ స్ఫూర్తితో ప్రతిఒక్కరూ గోవు కోసం ముందడుగు వేయాలన్నారు. ఆయన వెంట బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, మున్సిపల్, మండల అధ్యక్షులు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేష్, నాయకులు ఊడుగు వెంకటేశం, కాసుల వెంకటేశం, మునగాల రాజశేఖర్‌రెడ్డి, ఉష్కాగుల నాగరాజు, పబ్బు వంశీ, వెంకటేశం, దుర్గయ్య, తదితరులు ఉన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో కలెక్టర్ పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి కుటుంబ సభ్యులు

కనగల్ : మండలంలోని దర్వేశిపురం ఎల్లమ్మ ఆలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దంపతులు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం అర్చకులు కలెక్టర్‌కు తీర్థ ప్రసాదాలు అందజేయగా, మాజీ సర్పంచ్ చీదేటి వెంకట్‌రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. ఆమె వెంట ఆర్‌ఐ సునీత, కార్యదర్శి పద్మ, ఆలయ అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి



లాంచీ దిగి వస్తున్న పర్యాటకులు

నాగార్జునసాగర్ : సాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు సాగర్ సందర్శనకు వచ్చారు. అలాగే వారాంతం కావడంతో పలువురు ఉద్యోగులు సందర్శించారు. సిద్దిపేట జిల్లా అదనపు న్యాయమూర్తి మిలాన్ కాంబ్లే కుటుంబ సభ్యులు, మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ సాగర్‌ను సందర్శించిన వారిలో ఉన్నారు. పర్యాటకులు అధిక సంఖ్యలో రావడంతో బుద్ధవనం, కృష్ణాతీరం, నాగార్జునకొండ తదితర ప్రాంతాలు పర్యాటకులతో సందడిగా మారాయి.

పుష్‌పుల్ రైళ్లు రద్దు

మిర్యాలగూడ : ఏపీలోని పల్నాడు జిల్లా నడికుడి –హైదరాబాద్‌లోని కాచిగూడ మధ్య నడిచే పుష్‌పుల్ రైళ్లు రద్దు చేస్తూ సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. రోజూ ఉదయం 4.45గంటలకు, సాయంత్రం 4.10గంటలకు నడికుడి నుంచి ఈ‌ట్రైన్లు బయలుదేరి కాచిగూడ చేరేవి. రోజూ ఉదయం 9.20, సాయంత్రం 7.30గంటలకు కాచిగూడ నుంచి బయలుదేరి నడికుడి చేరేవి. అయితే ఈనెల 26నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వరకు 07276, 07277 నంబర్లు గల ట్రైన్లను రద్దు చేశారు. అలాగే ఈనెల 27 నుంచి వచ్చే ఏడాది మార్చి 1వరకు 07973, 07974, 07791 నంబర్ల గల ట్రైన్లను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో నిర్వహించే కుంభమేళాకు దేశ వ్యాప్తంగా కొన్ని ట్రైన్లను మళ్లించినట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే ట్రైన్లను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ట్రైన్ల రద్దుతో రోజూ రాకపోకలు సాగించే ప్రయాణికులకు అసౌకర్యం కలగనుంది.

శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాటం చేస్తాం

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్

చౌటుప్పల్ రూరల్: దేశంలో శాస్త్రీయ విద్యా విధానం కోసం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ అన్నారు. చౌటుప్పల్ మండలం చిన్నకొండూర్ గ్రామంలో ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్య వైజ్ఞానిక శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2009 విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కి డిటెన్షన్ విధానాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. విద్యార్థులను చదువుకు దూరం చేసే విధానాలను ప్రభుత్వం అవలంబిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం అమలు చేసే డిటెన్షన్ విధానం వల్ల పాఠశాల స్థాయిలోనే డ్రాపవుట్స్ పెరుగుతారని అన్నారు. రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లాగా పుట్టుకొస్తున్నా ప్రభుత్వం కట్టడి చేయకుండా విద్యను వ్యాపారంగా మార్చడం సరికాదన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు చట్టం చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్టళ్లలో ఫుడ్‌పాయిజన్ జరిగి విద్యార్థులు మరణిస్తున్నా సీఎం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు హాస్టళ్లో నిద్ర చేయడంతో పాటు సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు లావుడియ రాజు, రైతు సంఘం నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకుడు చింతల సుదర్శన్, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె మధుకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు తీగుళ్ల శ్రీనివాస్, నాయకులు నందు, మహేష్, నర్సింహ, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

సంస్థాన్ నారాయణపురం: స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సంస్థాన్ నారాయణపురం మండలంలోని మల్లారెడ్డిగూడెం గ్రామంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రావాల్సిన వాటా దక్కాలన్నారు. రాష్ట్రంలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు 69 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల వాటా బీసీలకు దక్కేందుకు అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేయాలన్నారు. దీనికి సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్ష పార్టీలను ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రాన్ని ఒప్పించాలని కోరారు. రాష్ట్రంలో కుల గణన సర్వే జరగలేదన్నారు. గుడిసెలలో, వలస, సంచార జాతులు లాంటి ప్రజలను సర్వేలో పరిగణనలోకి తీసుకోలేదన్నారు.

మంత్రి ఉత్తమ్ పీఏ పేరిట ఫోన్ కాల్

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో అసభ్యకరంగా మాట్లాడిన గుర్తుతెలియని వ్యక్తి

నేరేడుచర్ల: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పీఏనంటూ గుర్తుతెలియని వ్యక్తి నేరేడుచర్ల మండలానికి చెందిన ఇద్దరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడాడు. ఆదివారం ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్న బి. రమాదేవి, యశోదకు అక్టోబర్ 29వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ మండలంలో ఎన్ని అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అడిగాడు. అంతేకాకుండా ఖాళీ పోస్టుల వివరాలను తన వాట్సాప్‌కు మెసేజ్ పెట్టాలని హుకుం జారీ చేయడంతో పాటు వారితో అసభ్యకరంగా మాట్లాడాడు. ఆ ఫోన్ కాల్ గురించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విచారించగా అది ఫేక్ కాల్ అని తెలిసింది. దీంతో ఆదివారం నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇదారె ఇఖ్రామత్ ఖానా బహదూర్ ఖాన్ కమిటీ ఎన్నిక

నల్లగొండ టౌన్: ఇదారె ఇఖామత్ ఖానా బహదూర్ ఖాన్ జిల్లా నూతన కమిటీని ఆదివారం నల్లగొండలోని బహదూర్ఖాన్ కమ్యూనిటీ హాల్‌లో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా షాహిద్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా మాజీ కౌన్సిలర్ షఫీ నవాజ్‌ఖాన్, ఉపాధ్యక్షుడిగా ఖాజా మోహినొద్దీన్, సహాయ కార్యదర్శిగా మహమ్మద్ మునీర్, కోశాధికారిగా ఖాజాఫరీదుద్దీన్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు ఎన్నికల అధికారిగా ఎండీ ముజుబుద్దీన్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గులాం జిలానీ, షాబుద్దీన్, హాష్మి, అఖిల్ అహ్మద్, జమీల్ అహ్మద్, డాక్టర్ జాకీర్ హుస్సేన్, డాక్టర్ ఏఏ ఖాన్, షరీఫ్, అశ్వాఖాన్, అబ్దుల్ బారి తదితరులు పాల్గొన్నారు.

వందోసారి రక్తదానం

- ఆదర్శంగా నిలుస్తున్న కొప్పుల సుధాకర్‌రెడ్డి
- రెండుసార్లు ప్లేట్‌లెట్స్ కూడా దానం



రక్తదానం చేస్తున్న సుధాకర్‌రెడ్డి

నల్లగొండ, కనగల్ : అన్ని దానాల్లో కన్నా రక్తదానం మిన్న అనేది నానుడిని నిజం చేస్తూ ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు నల్లగొండకు చెందిన కొప్పుల సుధాకర్‌రెడ్డి. ఆదివారం నల్లగొండలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన రక్తదాన శిబిరంలో కొప్పుల సుధాకర్‌రెడ్డి వందోసారి రక్తదానం చేసి శభాష్ అనిపించుకున్నారు.

1991లో మొదటి సారి రక్తదానం చేశా..

ఈ సందర్భంగా ఆయన సాక్షితో మాట్లాడుతూ 1991లో కారు డ్రైవర్ రియాజ్ అనే వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. అర్ధరాత్రి 2 గంటలకు సెయింట్‌ఆల్ఫోన్సెస్‌లో పనిచేసే కేథరిన్ టీచర్ ఫోన్ చేశారు. తన వద్ద డ్రైవర్‌గా పనిచేసే రియాజ్ ప్రమాదంలో గాయపడ్డారు. అతనికి రక్తం అవసరం ఉందని చెప్పారు. నేను వెంటనే ఆసుపత్రికి వెళ్లి తొలిసారిగా రక్తదానం చేశాను. రక్తదానం చేసి ఒకప్రాణం రక్షించారంటూ వైద్యులు, అక్కడ ఉన్నవారంతా నన్ను మెచ్చుకోవడం ఎంతో ఆనందం కలిగించింది. అప్పుడే ఎన్ని రోజులకోసారి రక్తదానం చేయవచ్చని వైద్యులను అడిగాను. మూడు నెలలకోసారి ఇవ్వవచ్చని చెప్పారు. అప్పటి నుంచి ఎవరు ఆపదలోఉండి ఫోన్ చేసినా ఆసుపత్రికి వెళ్లి రక్తాన్ని ఇస్తున్నాను. 35 సార్లు రక్తదాన శిబిరంల్లో రక్తం ఇవ్వగా మిగిలిన 65 సార్లు ఆసుపత్రులకు వెళ్లి రక్తం అవసరమైన వారికి ఇచ్చాను. కరోనా సమయంలో కూడా ఒక వ్యక్తికి ప్లేటులెట్స్ పడిపోయాయని ఫోన్ చేశారు. దీంతో వెళ్లి ప్లేటులెట్స్ కూడా ఇచ్చాను. ఇప్పటి వరకు రెండుసార్లు ప్లేట్‌లెట్స్ ఇచ్చాను. తాజాగా ఆదివారం వందోసారి రక్తదానం చేశాను. ఇంకా రక్తదానం చేస్తూనే ఉంటానని సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తండ్రిని ఆదర్శంగా తీసుకుని రక్తం ఇచ్చిన కూతురు కొప్పుల సుధాకర్‌రెడ్డి వందసార్లు రక్తదానం ఇచ్చినా కూడా అతడు ఆరోగ్యంగానే ఉన్నాడు. అయితే తన తండ్రి రక్తదానం చేయడాన్ని చూసిన సుధాకర్‌రెడ్డి కూతురు సాయి నిశ్చల కూడా తండ్రిని ఆదర్శంగా తీసుకుని ఆదివారం రక్తదానం చేసింది. ఇక నుంచి అవసరమైనప్పుడు తాను కూడా తన తండ్రి వలె రక్తదానం చేస్తానని పేర్కొంది. నిశ్చల ప్రస్తుతం బీటెక్ 3వ సంవత్సరం చదువుతోంది.

రక్తదానం చేయడం అభినందనీయం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి

నల్లగొండ : రెడ్‌క్రాస్ సంస్థ రక్తదాన శిబిరాలు నిర్వహించి ఎంతోమంది ఆపదలో ఉన్న వారికి రక్తం అందిస్తుండడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నల్లగొండ క్లబ్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఆదివారం క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నల్లగొండ క్లబ్ వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా 105మంది వరకు రక్తదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు గోలి అమరేందర్‌రెడ్డి, మేనేజింగ్ కమిటీ చల్లా వెంకటరమణ, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డిలు మాట్లాడారు. రెడ్‌క్రాస్ సొసైటీ 66 సంవత్సరాలుగా ఎంతోమందికి సేవలు అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా వందోసారి రక్తదానం చేసిన క్లబ్ మెంబర్ కొప్పుల సుధాకర్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి క్లబ్ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మారగోని నవీన్‌కుమార్‌గౌడ్, ప్రతీక్ ఫౌండేషన్ చైర్మన్ గోనారెడ్డి, క్లబ్ కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకన్న, ముత్యంరెడ్డి, లక్ష్మీనారాయణ, యాదగిరి, కౌన్సిలర్లు రావిరాల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గుర్రంపోడు: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఈ ఘటన గుర్రంపోడు మండలం కొప్పోలులో జరిగింది. ఎస్‌ఐ పి. మధు తెలిపిన వివరాల ప్రకారం.. కొప్పోలు గ్రామానికి చెందిన దేవసారి రమేష్(30) కుటుంబ కలహాలతో ఈ నెల 27వ తేదీన ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వ్యవసాయ పనుల్లో తుంగతుర్తి ఎమ్మెల్యే



ట్రాక్టరుతో పొలంలో దమ్ము చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు



కూలీలకు వరి నారు పంచుతున్న ఎమ్మెల్యే సామేలు

అడ్డగూడూరు: ప్రజా సమస్యల పరిష్కారంలో నిత్యం బిజీగా ఉండే తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఆదివారం వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఆయన స్వగ్రామం అడ్డగూడూరు మండలం ధర్మారంలోని తన పొలంలో ట్రాక్టర్‌తో దమ్ము చేశారు. నారు మోశారు. ఎడ్ల బండిపై నారు తీసుకెళ్లారు. వరాలు తీసి పొలంలో ఎరువు చల్లారు. మహిళా కూలీలకు నారు పంచి వారితో ముచ్చటించారు.